## చిన్నకథ

# ప్రాణం తీపి

**"ఇన్నాళ్లూ మనతోపాటు పనిచేసిన మన కామేశ్వరరావుగారు ఈ రోజు రిటెర్ అవుతున్నారంటే బాధగా వున్నా మరొక విధంగా విశ్రాంతి తీసుకోవడంలో ఎంతో హాయి ఉంటుంది"**

**"ఇంతకాలం కుటుంబ విషయాల్లో చేయలేని పనులు యింక తీరుబడిగా చేసుకోవచ్చు"**

**"భార్యాబిడ్డలతో ఎక్కువ సమయం గడిపే అదృష్టం కలుగుతుంది"**

ఈ విధంగా కామేశ్వర రావుగారి పదవీవిరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన పార్టీలో – కామేశ్వర రావుగారి మంచితనం గురించి – పనిలో అతని నిజాయితీ గురించి క్రమశిక్షణ గురించి తోటి ఉద్యోగులు పొగుడుతూ ఉపన్యసించారు.

పార్టీ ఎంతో వైభవంగా జరిగింది. దండలు వేసి పుష్పగుచ్ఛాలు యిచ్చి, ప్రశంసాపత్రాలు చదివి, మొమెంటో యిచ్చి గౌరవించారు.

కామేశ్వరరావు గారు కూడా తన తోటి ఉద్యోగస్థులకు, యాజమాన్యం చేసిన గౌరవానికి • వినమ్రంగా కృతజ్ఞతలు చెప్పేరు.

కామేశ్వరరావుగారితో అందరూ ఫొటోలు దిగేరు. పార్టీ ముగిసిన తర్వాత తీపి గుర్తుగా అందరికీ అరకేజి స్వీటు పేకెట్లు ఇచ్చారు.

కామేశ్వరరావు గారు కూడా తనకిచ్చిన స్వీటు పేకెట్ పట్టుకొని యింటి ముఖం పట్టాడు. కాని –

తనకు షుగర్ చాలా ఎక్కువగా ఉంది. ఎంత కంట్రోలులో వుంచుకుందామనుకున్నా అవడం లేదు. ఇన్సులిన్ తీసుకుంటున్నా కూడా ఎక్కువగానే ఉంది.

రెండ్రోజులకోసారి గ్లూకోమీటర్ ద్వారా, ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, పి.పి. బ్లడ్ షుగర్ చూసుకుంటూ చాలా జాగ్రత్తగా వుండాడు. ఎక్కువ కేలరీలు లేని తిండే తింటాడు! కూరలు ఎక్కువ, అన్నం తక్కువ తింటాడు. తీపి వస్తువుల జోలికే పోడు. పంచదార అసలు ముట్టుకోడు. చప్పటి టీ, కాఫీలే తాగుతాడు.

ఎవరింటి కయినా వెళితే వారు కాఫీ, టీలు యిచ్చే ముందే పంచదార వెయ్యకండీ అని చెప్పేస్తాడు. వెన్న, నెయ్యి లాంటి కొవ్వు పదార్థాలు మానివేసి ఎన్నాళ్లయిందో? పార్టీలలో, పెళ్ళిళ్లలో కూడ స్వీట్లూ, ఐస్క్రీములూ ముట్టుకోడు. భోజన విషయంలో అంత ఖచ్చితంగా, అతి జాగ్రత్తగా ఉంటాడు.

"షుగర్ జబ్బు అనారోగ్యాలకి ద్వారం లాంటిది – దానిని అదుపులో వుంచకపోతే కొంప ముంచుతుంది" అని అంటాడు.

అంత జాగ్రత్త అయిన మనిషి కాబట్టి కామేశ్వరరావు గారికి ఆ స్వీట్ పేకెట్ ఏంచేయాలో తోచలేదు. ఇంట్లో తనూ తన భార్యా యిద్దరే! తన భార్యకు కూడా షుగరే. యిద్దామంటే పిల్లలు కూడా లేరు. ఇంట్లో వుంచితే తినాలని బుద్ధి పుడుతుంది, జిహ్వ చావదు. అందుచేత ఏం చెయ్యాలి?

ఇలా ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

దారిలో ఒక బిచ్చగాడు అడుక్కుంటున్నాడు! వాడి కడుపు నడ్డికి అంటుకు పోయినట్లు ఉంది. వీడికి యీ స్వీట్లు యిస్తే? ఎంత ఆనందిస్తాడో కదా!

నిజమే! తినడానికి మామూలు అన్నమే దొరకని వాడికి యిలాంటి స్వీట్లు కూడా ఎలా వస్తాయి. అసలు వీడికి యిలాటి స్వీట్లు వుంటాయని కూడా తెలీదేమో! తినాలని వున్నా డబ్బేది? ఎవరు కొని పెడతారు?

పాపం ! వీడికి యీ స్వీటు పాకెట్ యిస్తే?

'నా జన్మలో తినలేను బాబూ! మీ దయవల్ల యిప్పుడు తెలిసింది! నేతి మిఠాయిలో మజా ఏమిటో? మీదే పుణ్యం. ఆ భగవంతుడు మిమ్మల్ని చల్లగా చూడాల అని నన్నెంతలా పొగుడుతాడో' అనుకొని – ఆ స్వీటు పేకెట్ని ఆ ముష్టివాడికి యిచ్చేసేడు కామేశ్వరరావు.



ఆ ముష్టివాడు దానిని ఆత్రంగా తీసుకుని పేకట్ గబగబా విప్పి అందులో వున్న రకరకాల తీపి వస్తువులను చూసి ముఖం చాటంత చేసుకుని ఒక్కొక్కటీ ఆబగా తినడం మొదలు పెట్టాడు.

"బాగున్నాయా? అబ్బీ!" అని అడిగాడు కామేశ్వరరావు.

"బావున్నాయి బాబూ! చాలా చాలా బావున్నాయి. దండాలు బాబూ దండాలు! యిప్పుడు కొంచెం తిని, రేపు మరి కొంచెం తింటాను బాబూ మీ పేరు చెప్పుకొని" అని దండాలు పెడుతూ అన్నాడు.

వాడి ముఖంలో ఆనందం – తృప్తి చూసి కామేశ్వరరావు అక్కడినుండి కదిలాడు.

తన కిష్టమయిన స్వీట్లు తను తినలేనందుకు బాధ పడుతూనే ఇన్నాళ్లకు ఒకరు తింటూ వుంటే సంతోషించాడు.

యింటికి వచ్చి ఈ సంగతి భార్యతో చెప్పాడు.

"పోనీలెండి బీదవాడు, కడుపునిండా తిని వుంటాడు. అంత ఖరీదయినవి కొనుక్కు తినలేడు కదా! మంచి పని చేశారు!" అని అభినందించింది...

ఆ మర్నాడు కామేశ్వరరావు సరుకులు కొనుక్కుందుకు బజారుకు బయలు దేరాడు.

దారిలో కిందటి రోజు పార్టీనుండి వస్తూ ఎక్కడయితే ముష్టివాడికి స్వీట్ పేకట్ ఇచ్చాడో అదే చోటున చాలామంది మూగి వున్నారు.

'ఏమయింది చెప్మా?' అని కామేశ్వరరావు తొంగి చూశాడు. యింకేముంది!

ఆ ముష్టివాడు చచ్చిపోయి వున్నాడు. పక్కనే తనిచ్చిన ఖాళీ స్వీట్ పేకట్ పెట్టె పడి ఉంది!

"పాపం దిక్కులేని చావు చచ్చాడు! నిన్నటి వరకూ బాగానే వున్నాడు! ఒక్కసారిగా ఏమొచ్చిందో! పొద్దున్న అయ్యేసరికి శవమయి పడి ఉన్నాడు"

"తనవాళ్లు ఎవరయినా వున్నారో? లేదో?"

యిలా అక్కడ గుమికూడిన వాళ్లందరూ అనుకుంటున్నారు.

కామేశ్వరరావుకి కూడా ఆశ్చర్యం వేసింది–

కిందటి రాత్రి ముష్టివానికి కడుపు నిండా నేతి మిఠాయి యిచ్చినందుకు – ఎంతో హాయిగా నిద్రపోయిన సంగతి జ్ఞాపకం వచ్చింది. కానీ అదే రాత్రి యీ ముష్టివాడు శాశ్వత నిద్రపోయేడని ఏం తెలుసు?

ఆ ముష్టివాడికి కూడా షుగర్ వ్యాధి వున్నదని – ఆ స్వీట్లు తినడం వల్లనే హైపర్ గ్లైసేమియా వచ్చి గుండె ఆగి చనిపోయాడని ఎవరికి తెలుసు?

అప్పటికే కొందరు ఆ ముష్టివాడి దహన సంస్కారం కోసం చందాలు పోగు చేయడం మొదలెట్టేరు.

కామేశ్వరరావు తన వంతుగా నూరు రూపాయలు తీసి కళ్లలో నీళ్లు తిరుగుతుండగా వాళ్ల చేతుల్లో పెట్టాడు.

– ద్వివేదుల సోమనాథశాస్త్రి